# ఇది తెలంగాణ ప్రజల 'విజయ' దశమి

- తెలంగాణను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చాం
- పదేండ్ల ప్రస్థానంలో విజయాలే పార్టీ ప్రచార అస్త్రాలు
- మ్యానిఫెస్టోను ప్రతి గడపకూ తీసుకెళ్లాలి
- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, అక్టోబర్ 24: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పదేండ్ల పరిపాలన తెలంగాణ ప్రజలకు విజయ దశమిగా నిలిచిపోనున్నదని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం దసరా పండుగ వేడుకల్లో భాగంగా పాతబస్టాండ్ నుంచి శమీ వృక్షం వరకు నిర్వహించిన ఊరేగింపులో వనపర్తి సంస్థానాధీశుడు రాజారామేశ్వరరావుతో కలిసి మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం శమీ వృక్షానికి సంస్థానధీశులతో కలిసి పూజలు చేశారు. అనంతరం ప్రజలందరికీ శమీ ఆకు పెట్టి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ తెచ్చుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రా న్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నా మన్నారు. ఈ పదేండ్లలో ప్రజల కోసం విజయవంతంగా ఎన్నో పథకాలను అమలు చేశామని, వాటినే వచ్చే ఎన్నికల్లో పార్టీ ప్రచార అస్త్రాలుగా మార్చుకోవాలన్నారు. దేశంలోని రాష్ట్రాల్లో అన్నింటికంటే విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయం, పారిశ్రామిక, ఉపాధి రంగాల్లో తెలంగాణను అగ్రభాగన నిలిపామన్నారు. అదేవిధంగా కేసీఆర్ ఆశీస్సులతో వనపర్తిని వందేళ్ల భవిష్యత్తుకు బాటలు వేశామన్నారు. నాడు కరువు కాటకాలతో ఉన్న ఈనేలను సాగునీరు తీసుకొచ్చి లక్ష ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా 64మినీ ఎత్తిపోతల పథకాలతో మిట్ట ప్రాంతాలకు సాగునీరు అం దిస్తున్న ఘనత మనకే దక్కుతుందన్నారు. దీంతో గతం లో సాగు లేక వలసలు వెళ్లిన గ్రామాలు, నేడు పండుగ వాతావరణంలో కనిపిస్తున్నాయన్నారు. వీటితో పాటు ఈ ప్రాంత విద్యార్థుల ఉన్నత చదువుల కోసం మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్, మత్స్య, వ్యవసాయ కళాశాలలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వీటిన్నింటికి తోడుగా ప్రతిష్టాత్మకంగా ఐటీ టవర్ ఏర్పాటుకు సన్నాహాలు మొదలుపెట్టామన్నారు. ఉన్నత చదువులు చదివి ఎక్కడికో వెళ్లి ఉద్యోగం చేసుకొనే పరిస్థితుల నుంచి ఉన్న కాడి నుంచే సాం కేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొనే పరిస్థితులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఐటీ హబ్ ఏర్పాటు చేసుకోబోతున్నామన్నారు. అన్ని రంగాల్లో వనపర్తిని ముందు వరుసలో నిలబెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. పట్టణ ప్రజల చిరకాల వాంఛగా మిగిలిపోయిన రోడ్ల విస్తరణను ప్రజల సమ్మతితో పూర్తి చేస్తున్నామన్నారు. పట్టణంతోపాటు నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి, తండాకు రోడ్ల వేశామన్నారు. వనపర్తి ప్రజల దాహార్తిని తీర్చిందుకు మిషన్ భగీరథ పథకాన్ని రూ. 450కోట్లతో పెద్దమందడి మండల శివారులో పెద్ద ఎత్తున నిర్మాణం చేశామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ కూడా సాగు, తాగునీరుకు కొరత లేకుండా అం దిస్తున్నామన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా శిథిలమవుతున్న పాలిటెక్నిక్ భవనాన్ని మరమ్మతులు, మైదానాన్ని పునరుద్ధరించడానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. పార్కులు, చెరువు కట్టలను సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. గత పదేండ్లుగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి వెంట ప్రజాప్రతినిధులు, నా యకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



శమీ పూజ ఊరేగింపులో పాల్గొన్న మంత్రి నిరంజన్‌రెడ్డి, వనపర్తి సంస్థానాధీశుడు రాజారామేశ్వరరావు

### పల్లకీ సేవలో పాల్గొన్న మంత్రి

వనపర్తి, అక్టోబర్ 24: దసరా ఉత్సవాల్లో భాగంగా వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శమీ పూజ, పల్లకీ సేవ కార్యక్రమంలో మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చాకే ఆలయాలకు, పండితులకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. తెలంగాణలోని యాదగిరిగుట్టకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారని గుర్తుచేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రిని శాలువా కప్పి ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, పట్టణ సమన్వయ కర్త అరుణ్‌ప్రకాశ్, తిరుమల్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.



కొత్తకోటలో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

## కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలి

- నిబద్ధతతో పనిచేస్తే అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు
- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- కొత్తకోట, మదనాపురంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలు ప్రారంభం

కొత్తకోట, అక్టోబర్ 24: రాబోయే ఎన్నికల్లో కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తకోట పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల మ్యానిఫెస్టో అంశాలకు ప్రతి వార్డులో ఇంటింటికీ చేరవేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పని చేసే కార్యకర్తకు అవకాశాలు అందిపుచ్చుకుంటాయని, ఎవరూ నిరాశకు గురికావొద్దని, పార్టీ కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ఎన్నికలు జరిగే చివరి రోజు వరకు ఆలసత్వం వద్దని హ్యాట్రిక్ విజయం మనదేనని ఎమ్మెల్యేతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరుగుతాయని అందు కోసం కార్యకర్త ఆహర్నిశలు పని చేయాలన్నారు. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి చేసింది ఏమీ లేదన్నారు. వంద ఏండ్లలో సాధించని ప్రగతి కేవలం తొమ్మిదేండ్లలో సాధించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, వైస్ చైర్‌పర్సన్ జయమ్మ, మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్, ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి ప్రశాంత్, కౌన్సిలర్లు కొండారెడ్డి, రాములుయాదవ్, సంధ్య, పద్మ, రామ్మోహన్‌రెడ్డి, తిరుపతయ్య, ఖాజామైనుద్దీన్, బాలకృష్ణ, బాబురెడ్డి, ప్రసన్నలక్ష్మి, శ్రీనూజీ, ఆకుల శ్రీను పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

మదనాపురం, అక్టోబర్ 24 : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మదనాపురం మండలకేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి, కారుగుర్తుకు ఓటువేసే విధంగా చూడాలని అన్నారు. ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి హ్యాట్రిక్ విజయం పక్కా అని, మూడోసారి సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రావణ్‌కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌నారాయణ, మాజీ ఎంపీటీసీ నాగన్న యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యాదగిరి, గ్రామాధ్యక్షుడు బాలకృష్ణ, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు రవీందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నదికి హారతి ఇస్తున్న అర్చకులు



జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామివార్లకు చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

## నేత్రపర్వం తెప్పోత్సవం

- జలవిహారం చేసిన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి
- ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

అలంపూర్, అక్టోబర్ 24 : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా త్రినేత్రికి తుంగభద్రానదిలో అంగరంగ వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ సమీపంలోని నదిలో ఆదిదంపతులు హంస వాహనంపై జల విహారం (తెప్పోత్సవం) చేయగా నదీమతల్లి పులకించింది. దసరా పండుగను పురస్కరించుకొని ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మహా పూర్ణాహుతి, సాయంత్రం శమీపూజ, మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం తుంగభద్రానదిలో ఆది దంపతులైన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పపై (హంస వాహనం)నదిలో జల విహారం చేశారు. ఈ కార్యక్రమాన్ని చూడడానికి అలంపూర్ సివిల్ జడ్డి కమలాపురం కవిత, భక్తులు అశేషంగా తరలొచ్చారు. ఉత్సవాల ముగింపు రోజున జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వాముల ఉత్సవమూర్తులకు ఆలయ సమీపంలో నాగకన్యల బావిలో చక్రస్నానం చేయించారు. తెప్పోత్సవం ముగిసిన వెంటనే నదీ తీరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతంలో అర్చకులు నదీ హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.



నదిలో విహరిస్తున్న ఆదిదంపతులు

కుంభహారతి, రథహారతి, నక్షత్ర హారతి, దశవిధ హారతులను నదీమ తల్లికి సమర్పించారు. నదికి హారతి ఇవ్వడం అంటే సకల దేవతలను ఏక కాలంలో స్మరించిట్లేనని పండితులు పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన చిన్నారుల నృత్య కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవాలను వైభవంగా నిర్వహించిన ఆయా శాఖల అధికారులు, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రితిరాజ్‌కు దేవస్థానం తరపున ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్నకృష్ణయ్యానాయుడు, ఈవో పురేందర్‌కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

- బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త ప్రమోద్‌రెడ్డి

పెబ్బేరు, అక్టోబర్ 24 : వనపర్తిలో జరుగనున్న సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభ విజయవంతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌రెడ్డి కోరారు. సోమవారం పెబ్బేరులోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సభ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. ఈ నెల 26న మధ్యాహ్నం పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో శాసనసభ ఎన్నికలకు సంబంధించి పెద్ద ఎత్తున బహిరంగ సభను ఏర్పాటు చేశామని, ఇందులో సీఎం కేసీఆర్ ప్రసంగిస్తారని చెప్పారు. మంత్రి నిరంజన్‌రెడ్డి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపే లక్ష్యంగా ముఖ్యంగా యువత కీలకంగా వ్యవహరించాలన్నారు. ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని వాటితో వనపర్తిని ప్రగతిపథంలో నడిపిస్తున్న నిరంజన్‌రెడ్డిని ఈ పర్యాయం లక్ష ఓట్ల మెజారిటే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడాలని ప్రమోద్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, నాయకులు పెద్దింటి వెంకటేశ్, గోవింద్ నాయుడు, మహేశ్వర్‌రెడ్డి, మరుగల రాజశేఖర్, గోల్డు బాలస్వామి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో మాట్లాడుతున్న ప్రమోద్‌రెడ్డి